క్లుప్తంగా

18 వరకు 'మద్యం' గడువు

పాల్వంచరూరల్: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల18 వరకు మాత్రమే గడువు ఉందని ఎక్సైజ్ సీఐ.ఎం. ప్రసాద్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 13 మద్యం దుకాణాలు ఉన్నాయని, ఇందులో పాల్వంచ పట్టణ పరిధిలో 8 దుకాణాలు ఓపెన్ కేటగిరీ, పెద్దమ్మగుడి దగ్గర జగన్నాథపురంలోని ఒకటి, ములకలపల్లి మండలంలోని నాలుగు మద్యం దుకాణాలు ఎస్టీలకు కేటాయించబడ్డాయని పేర్కొన్నారు. జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి కార్యాలయం కొత్తగూడెంలో ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. వివరాలకు 8712658852 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గిరిజనులకు రిజర్వేషన్లు అమలు చేయాలి

ఇల్లెందు: స్థానిక సంస్థల ఎన్నికల్లో గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులకు రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎస్‌ఏ నబీ కోరారు. గురువారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ఈ ఎన్నికలను ఒక ఎత్తుగా ఉపయోగించుకుని సీపీఎంను విస్తరించేందుకు పోటీ చేయబోతున్నామని పేర్కొన్నారు. గిరిజన చట్టాలను పక్కన పెట్టి రిజర్వేషన్లు ఇతరులకు కట్టబెట్టడాన్ని పునరాలోచన చేయాలని కోరారు. ఆలేటి కిరణ్, మోహన్‌రావు, సుల్తానా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నవరాత్రుల ఖర్చులు వెల్లడించండి..

సింగరేణి(కొత్తగూడెం): ఏఐటీయూసీ చేతిలో పీవీకే యాజమాన్యం కీలుబొమ్మగా మారిందని, అమ్మవారి ప్రసాదాన్ని కార్మిక సంఘాల నేతలు బహిష్కరించారని, గుడిలో కూడా గుర్తింపు సంఘం నాయకులు తారతమ్యం చూపటం సరైందికాదని పలు కార్మిక సంఘాల నాయకులు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గుర్తింపు సంఘం తోటి సంఘాలను చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబం, ఒకే లక్ష్యం, ఒకే గమ్యం అనే నినాదం గోడమీద రాతలకే పరిమితం అయ్యాయని, ఓడిన సంఘాలపై వివక్ష చూపుతున్న ఐఆర్ పాలసీకి విరుద్ధం వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నవరాత్రుల ఖర్చుల వెల్లడించాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయండి..



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చుంచుపల్లి: జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, ఫసల్ బీమా పథకాన్ని అమలు, రుణమాఫీ కాని రైతులకు రుణమాఫీ చేయాలని, యాసంగి సీజన్‌లో ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, జల్లారపు శ్రీనివాస్, గుగులోత్ రమేష్, తెల్లం నరసింహారావు, పైడిపాటి రవీందర్, గొడుగు శ్రీధర్ యాదవ్, వందనపు సుబ్బు, నవీన్ పాల్గొన్నారు.

గురుకుల భవనాలు నిర్మించాలి

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో మంజూరైన గురుకులాలకు నిధులు కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు దారావత్ సురేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం టేకులపల్లి మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. మండలానికి మంజూరైన మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకులం టేకులపల్లిలో భవనం లేక ఖమ్మంలో అద్దె భవనంలో కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం టేకులపల్లిలో కొనసాగుతున్న బాలుర గురుకులం చాలీచాలని గిరిజన సంక్షేమ శాఖ భవనంలో నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని గురుకులాలకు సొంత భవనాలు మంజూరయ్యేలా కృషి చేయాలని కోరారు.

చేగువేరాకు నివాళి

సూపర్‌బజార్(కొత్తగూడెం): గెరిల్లా పోరాట యోధుడు ఎర్నెస్టో చేగువేరా అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఫహీమ్ దాదా అన్నారు. చేగువేరా 58వ వర్ధంతి సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం శేష గిరిభవన్‌లో ఏర్పాటు చేసిన చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ క్యూబాలో జన్మించిన చేగువేరా కేవలం తన దేశానికే కాక పలు దేశాలలో పర్యటించి పెట్టుబడిదారీ వ్యవస్థపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడని కొనియాడారు. ఖయ్యూం, భూపేష్, జావీద్, కొచ్చెర్ల రాకేష్, రణధీర్, ఇర్ఫాన్, నదీమ్, అజయ్, రవి, విజయ్ కాంత్ పాల్గొన్నారు.

పది నెలలుగా పునాదిలోనే!

- సా...గుతున్న ఇల్లెందు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం
- రూ.1.43 కోట్లతో శంకుస్థాపన



నిర్మాణంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణానికి అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్ (యుపీహెచ్‌సీ) మంజూరయింది. 2025 జనవరి 23న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. అప్పటికే మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగింపు దశకు చేరింది. దీంతో ఆఘమేఘాల మీద శంకుస్థాపన చేయించారు. అయితే వెంటనే పనులు ప్రారంభం అవుతాయని అంతా ఆశ పడ్డారు. శంకుస్థాపన జరిగి ఇప్పటికి పది నెలలైంది. రూ.1.43 కోట్ల నిధులతో చేపట్టనున్న పనులకు కొంతకాలం డిజైన్ మార్పు, మరికొంత కాలం అప్రూవల్‌లో జాప్యం జరిగింది. అన్నీ పనులు పూర్తై టెండర్ కూడా జరిగింది. శంకుస్థాపన జరిగిన ఆరు నెలలకు పనులు ప్రారంభం అయ్యాయి. అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నత్తనడకన పనులు సాగుతున్నాయని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. ఇల్లెందు పట్టణంలో 100 పడకల ఆస్పత్రి, రెండు బస్తీదవఖానాలు ఉన్నాయి. వీటికి తోడు ఒక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మంజూరయింది.

తొలగని మబ్బులు..

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి అలుముకున్న కారుమబ్బులు తొలగిపోవటం లేదు. తొలుత ఇల్లెందులపాడులో నిర్మించాలని నిర్ణయించారు. రెండు వర్గాల మధ్య విభేదాలతో భూమి కేటాయింపు వివాదాస్పదం అయింది. దీంతో నిర్మాణాన్ని ఆ ప్రాంతం నుంచి కోర్టు ఏరియాకు మార్చారు. శంకుస్థాపన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేశారు. అయితే అక్కడ కూడా విఘ్నాలు అడ్డు వచ్చాయి. ఈ సెంటర్ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. నిన్నటి వరకు డిజైన్, అప్రూవల్, టెండర్ వల్ల జాప్యం జరగగా నేడు పనులు వేగంగా సాగటం లేదంటున్నారు.

పేదలకు ఉపయోగం..

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం వల్ల ఈ ప్రాంతానికి ఎంతో ఉపయోగం ఉంటుంది. ఇల్లెందు ఏరియా 100 పడకల ఆస్పత్రి మీద భారం తగ్గుతుంది. ఇప్పటికే ఇల్లెందు మున్సిపాలిటీలో రెండు బస్తీదవాఖానాలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌తో వేగంగా పేదలకు వైద్యసేవలకు అవకాశం ఉంటుంది. ఈ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణంతో సమీపంలో ఉన్న మూడు బాలుర హాస్టళ్లు, రెండు బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వైద్యం మరింత అందుబాటులో ఉంటుంది. ఈ కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్లు ఇతర సిబ్బంది ఉంటారు. రూరల్‌లో పీహెచ్‌సీ తరహాలోనే అర్బన్‌లోనూ ఈ పీహెచ్‌సీలా పని చేస్తుంది. దీని పరిధిలో సబ్ సెంటర్‌ల వైశాల్యం తక్కువ నిడివిలో ఉంటాయి. దీని వల్ల ఏరియా ఆస్పత్రి మీద భారం తగ్గే అవకాశం ఉంది.



శిలాఫలకం

పనులు త్వరగా పూర్తి చేయాలి..



అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. శంకుస్థాపన జరిగిన పది నెలలు అవుతోంది. పనులు నత్తనడకన సాగుతున్నాయి. సంబంధిత అధికారులు, అప్పటి జెడ్పీ చైర్మన్, ఇప్పటి ఎమ్మెల్యే స్పందించాలి.

– కె.హరిప్రసాద్ యాదవ్, స్టేషన్ బస్తీ, ఇల్లెందు

నిర్మాణం వేగవంతం చేస్తాం..



అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటాము. ఇప్పటికే పనులు సాగుతున్నాయి. నిర్ణీత కాలంలో పూర్తి చేసేలా కాంట్రాక్టర్ మీద ఒత్తిడి పెంచుతాము. వర్షాల వల్ల పనులు వేగంగా జరగడం లేదు.

– సీహెచ్. శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, ఇల్లెందు

ఎన్నికలు ఎప్పుడు జరిగినా సత్తా చాటుదాం..



మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య అన్నారు. గురువారం ఇల్లెందులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ప్రతీ కార్యకర్త ముందుకు సాగాలన్నారు. ఎన్నికల ఒడంబడిక ఆధారంగా 16 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్న వారికే టికెట్ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.శంకర్, బి.సత్యనారాయణ, రవి, మోజేస్, కృష్ణ, ఉడుత ఐలయ్య, శ్రీను, మంచాల వెంకటేశ్వర్లు, రాము, రాఘవేంద్రరావు, తాండ్ర లక్ష్మీనారాయణ, బొల్లి కొమురయ్య, సదానందం, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం బాబూక్యాంపు, ఎస్‌కే నగర్ మహిళలకు ఉచిత మగ్గం వర్క్, టైలరింగ్ శిక్షణ తరగతులను, కొత్తగూడెం పరిసర ప్రాంత మహిళలకు ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ క్లాసులకు జీఎం (పర్సనల్) వెల్ఫేర్ – సీఎస్‌ఆర్ జీవీ కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ముఖ్య ఉద్దేశం ఉద్యోగ కుటుంబ మహిళలు, ప్రాజెక్టు ప్రభావిత, పరిసర ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వృత్తి విద్యా కోర్సులు చాలా విలువైనవని శ్రద్ధగా నేర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) కేసా నారాయణరావు, వెల్ఫేర్ పీఏ కే.వరప్రసాదరావు, సేవా కోఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, సేవా సెక్రెటరీ మాధవీ స్వర్ణలత, సేవా కోఆర్డినేటర్లు కే.సుజాత, పుష్ప, సంధ్య, పద్మావతి, శిక్షకులు పాల్గొన్నారు.

ఇతర రంగాలపై సింగరేణి దృష్టి

కొత్తగూడెంఅర్బన్: సెంట్రల్ వర్క్‌షాప్‌లో స్టీల్ మెట్లు, ఐ లవ్ సెంట్రల్ వర్క్‌షాప్ లోగోను సింగరేణి డైరెక్టర్ (ఈ–ఎం) ఎం.తిరుమలరావు గురువారం ఆవిష్కరించారు. మాట్లాడుతూ సెంట్రల్ వర్క్ షాప్‌లో రూపొందించే వివిధ రకాల పరికరాలు సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో ముఖ్యపాత్ర వహిస్తున్నాయని తెలిపారు. పెద్ద కంపెనీలు సైతం చేయలేని యంత్ర పరికరాలను కూడా సెంట్రల్ వర్క్‌షాప్‌లో రూపొందిస్తున్నట్లు చెప్పారు. సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశంతో భవిష్యత్‌లో కంపెనీ అభివృద్ధికి బొగ్గుపై మాత్రమే ఆధారపడకుండా థర్మల్, సోలార్ పవర్, క్రిటికల్ మినరల్స్ రంగాలలో బంగారు గనులలో అన్వేషణలో కూడా ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సెంట్రల్ వర్క్‌షాప్ ప్రాంగణంలో మొక్క నాటారు.

ఈ కార్యక్రమములో ఏజీఎం(ఈ–ఎం) మెయిన్ వర్క్‌షాప్ పి.రాజీవ్ కుమార్, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వీ రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టీయూసీ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, ఎస్ఈ(ఈ–ఎం) జి.ఉమామహేశ్వరరావు, పిట్‌సెక్రటరీలు ఎస్.రామ్‌శేఖర్, కే.పరమేష్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'గూడెం'లో ఘనంగా అట్లతద్దె



సంబురాల్లో పాల్గొన్న మహిళలు

కొత్తగూడెంటౌన్: అట్లతద్దె పండుగను గురువారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు. గౌరమ్మ తల్లికి, గోమాతకు పూజలు నిర్వహించారు. రామవరం గోధుమవాగు వద్ద శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో అట్లతద్దె వేడుకకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సామూహికంగా ఉయ్యాలలు ఊగుతూ ఆడిపాడారు. ఉపవాస దీక్ష చేసి, రాత్రి చంద్రుడిని చూసిన తరువాత దీక్ష విరమించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచరూరల్: మండలంలోని నాగారం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏఈ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నాగారంకాలనీ, దంతలబోరు, సంగం, నారాయణరావుపేట, తోగ్గూడెం తదితర పరిసర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సీతారామ కెనాల్ సర్వే



రాఘవాపురంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

సుజాతనగర్: సీతారామ ప్రధాన కాల్వకు అనుబంధంగా చేపట్టనున్న డిస్ట్రిబ్యూటర్ కెనాల్ సర్వే ప్రక్రియను రాఘవాపురం గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌ఎల్‌ఐపీ ప్రాజెక్ట్ ఏఈ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటర్ కాల్వ కోసం రాఘవాపురం, సీతంపేట రెండు గ్రామాల్లో భూమిని సేకరించనున్నట్లు చెప్పారు. రాఘవాపురంలో సుమారు 50 మంది రైతులకు చెందిన 29.12 కుంటల భూమి అవసరం అని తెలిపారు. ఇందుకు సంబంధించి తొలిరోజు సర్వేలో సుమారు 20 మంది రైతుల పొలాల్లో కాల్వ హద్దులను ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన పెసా గ్రామసభల తీర్మానం మేరకు రైతులు భూ సేకరణకు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ వినోద్, ఆర్‌ఐ కాంతారావు, రైతులు పాల్గొన్నారు.

డొంక రోడ్డు కబ్జా..


చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు రైతుల వినతి



ఆక్రమణకు గురైన డొంకదారి

సుజాతనగర్: సుజాతనగర్‌లో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. మండల కేంద్రంలోని ధన్వంతరీ కళాశాల ఎదురు నుంచి సింగభూపాలెం చెరువుకు వరకు సుమారు 90 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన డొంక దారి ప్రస్తుతం కబ్జా అయింది. 1935లో సింగభూపాలెం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న సమయంలో రహదారి సౌకర్యం కోసం సుమారు 100 అడుగుల డొంకరోడ్డును నాటి నిజాం అధికారులు ఏర్పాటు చేశారు. ఈ రహదారి గుండా గతంలో సింగభూపాలెం గ్రామ ప్రజలు నడిచేవారు. 273, 274, 288, 1624,1625, 1626 ఇలా సుమారు 20 సర్వే నంబర్ల మీదుగా ఈ రహదారిని ఏర్పాటు చేశారు. అయితే ఈ రహదారికి అధికారులు ఏర్పాటు చేసిన హద్దు రాళ్లు కూడా ప్రస్తుతం కనిపించకుండా పోయాయి. రహదారికి ఇరువైపులా విలువైన భూములు ఉండటంతో హద్దులను సైతం తొలగించి ఏకంగా వ్యవసాయ భూముల్లో రహదారిని కలిపేసుకున్నారు. ఇక్కడ గతంలో వెంచర్ ఏర్పాటు చేయగా... రహదారిలో ఏకంగా ఓ భవనాన్ని కూడా నిర్మించిరు. కొంతమంది రియల్టర్లు డొంక దారిని ఆక్రమించి భవనాలను నిర్మాణం చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు అందినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారుల బంధీ నుంచి విడిపించి ఈ రహదారిని బీటీ రోడ్డుగా ఏర్పాటు చేస్తే సింగభూపాలెం, కొత్త అంజనాపురం, పాత అంజనాపురం, బేతంపూడి, జామ్లాతండా తదితర గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు మండల కేంద్రానికి వెళ్లే అవసరం లేకుండా ఈ రహదారి గుండా ప్రయాణం చేసే వీలుంది. దీంతో సుజాతనగర్‌లో ట్రాఫిక్ రద్దీ ఉండదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన డొంకదారికి వెలికి తీయాలని పలువురు కోరుతున్నారు.


హద్దులు నిర్ణయించాలి..



సింగభూపాలెం చెరువు వరకు 100 అడుగుల వెడల్పుతో రోడ్డు ఉండేది. పశువులను కూడా పొలాలకు తోలుకెళ్లేవారు. ప్రస్తుతం చాలా వరకు ఆక్రమణకు గురయింది. అధికారులు తక్షణమే సర్వే నిర్వహించి రహదారిని పునరుద్ధరించాలి.

– వీర్ల రమేష్, సీపీఎం మండల కార్యదర్శి

నక్షాలో ఉంది..



తమ వద్ద ఉన్న నక్షాలో డొంక దారి ఉంది. త్వరలో సర్వే నిర్వహించి డొంకదారి ఎంత మేర ఆక్రమణకు గురైందో గుర్తిస్తాం. హద్దులు ఏర్పాటు చేసి గతంలో వలే రహదారిని ఏర్పాటు చేస్తాం. ఆక్రమణకు గురైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– వనం కృష్ణప్రసాద్, తహసీల్దార్, సుజాతనగర్

'బీజేపీ ఓటు చోరీ చేస్తోంది..'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ఎన్నికల్లో నెగ్గడానికి బీజేపీ ఓటు చోరీకి పాల్పడిందని, దీనికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకుల మీద ఉందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన ఓటు చోరీ నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతీ గ్రామం నుంచి ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రజలతో సంతకాలు సేకరించాలని సూచించారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమం సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ యదళపల్లి అనసూర్య, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు డానియేల్, పులి సైదులు, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి..



మాట్లాడుతున్న శ్రీధర్

జూలూరుపాడు: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ అన్నారు. గురువారం గుండెపుడి గ్రామంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీల ఎన్నికల్లో సీపీఎం పోటీ చేస్తుందన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడంతో గ్రామాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజా సమస్యల కోసం నిరంతరాయంగా పని చేసే నిజాయితీ పరులైన సీపీఎం అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, ఇస్లావత్ భద్రు, బానోత్ మధు, వల్లమల్ల చందర్‌రావు, గడిదేశి కనకరత్నం, ఇల్లంగి సీతారాములు, దానయ్య, లక్ష్మణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు హెల్ప్ డెస్క్



హెల్ప్ డెస్క్‌లో వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

జూలూరుపాడు: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను జూలూరుపాడు ఎంపీడీఓ తాళ్లూరి రవి గురువారం జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీకి ఒక నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, 10 ఎంపీటీసీలకు మూడు నామినేషన్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా అభ్యర్థులు వివరాలు తెలుసుకునేందుకు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. పలు పార్టీల నాయకులు నామినేషన్ దరఖాస్తులను తీసుకెళ్లారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని కొత్తగూడెం డీఎస్పీ ఎస్కే అబ్దుల్ రెహమాన్ సందర్శించి, నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు.

పోషకాహారంతో ఆరోగ్యం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న పద్మశ్రీ

సుజాతనగర్: పోషకాహారం ఆరోగ్యకరమైన జీవనానికి ఎంతో ఉపయోగపడుతోందని కొత్తగూడెం ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మశ్రీ అన్నారు. పోషణమాసంలో భాగంగా వేపలగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పలువురి చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భంలోని శిశువు ఎదుగుదల నుంచి శిశువు జన్మించే వరకు.. ఆ తరువాత ఎదుగుతున్న పిల్లలకు పోషకాహారం అందిస్తే ఎంతో ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్వరూపరాణి, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, మాధవి, సరస్వతి, పద్మ, వీరమ్మ, కళావతి, హేమలత పాల్గొన్నారు.

పత్తి రైతులు మోసపోవద్దు..



అవగాహన కల్పిస్తున్న మార్కెట్ అధికారులు

ఇల్లెందురూరల్: రైతులు పత్తి పంటను విక్రయించేటప్పుడు దళారులు అడిగిన ధరకు ఇచ్చి మోసపోవద్దని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి నరేష్ సూచించారు. మిట్టపల్లి, రొంపేడు గ్రామపంచాయతీల పరిధిలో గురువారం పత్తి సాగు చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి పత్తి విక్రయాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతుల నుంచి పత్తి కొనుగోళ్లలో దళారుల దోపిడీని అరికట్టేలా సీసీఐ ఈసారి కపాస్ కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా రైతులు నేరుగా స్లాట్ బుక్ చేసుకొని తమ పంటను ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవచ్చని వివరించారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి నేరుగా కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతు పేరు, జెండర్, పుట్టిన తేదీ, కులం, చిరునామా, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ వంటి వ్యక్తిగత వివరాలతోపాటు పట్టాదారు పాస్‌పుస్తకం, సర్వే నంబర్, భూమి విస్తీర్ణం, పత్తి సాగు విస్తీర్ణం, పంట రకం వంటి వివరాలు యాప్‌లో నమోదు చేసి రైతు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. విక్రయించిన పత్తికి డబ్బులు రైతు అకౌంట్‌లో నేరుగా జమ అవుతాయని, దీనికోసం ప్రతీ రైతు తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ నంబర్ లింక్ వివరాలు సరిచూసుకోవాలని చెప్పారు. రైతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సిబ్బంది రంజిత్, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.